క్లుప్తంగా

క్రీడాకారిణికి అభినందనలు



పూజితను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రణస్థలం: ఇటీవల నంద్యాలలో నిర్వహించిన 68వ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ ఫెన్సింగ్ పోటీల్లో అండర్‌–19 విభాగంలో కోటపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థిని బొట్టా పూజిత జట్టు మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించినట్లు హెచ్‌ఎం వై.రామం తెలిపారు. వ్యక్తిగత విభాగంలో నాలుగో బ్రాంజ్ మెడల్ సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా పూజితను హెచ్‌ఎం, వ్యాయామ ఉపాధ్యాయులు సీహెచ్ భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి సాయం



చిన్నారావుకు సాయం అందిస్తున్న దాతలు

శ్రీకాకుళం కల్చరల్: మండలంలోని కిల్లిపాలెం గ్రామానికి చెందిన అలబాన చిన్నారావు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి సభ్యులు మంగళవారం రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో పొడుగు అవినాష్, జగదీష్, బరాటం చంద్రశేఖర్, చరణ్ పాల్గొన్నారు.

7న తల్లిదండ్రుల సమావేశం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల పరిధిలోని 106 ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఈ నెల 7న సమావేశం నిర్వహించనున్నట్లు ఎంఈవో కె.పున్నయ్య మంగళవారం తెలిపారు. పాఠశాలల ప్రగతి, డ్రాపౌట్ నియంత్రణ, మెరుగైన విద్యాబోధన వంటి అంశాలపై చర్చించనున్నట్లు చెప్పారు.

సమాచారం అందిస్తే ప్రోత్సాహకాలు



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

రణస్థలం: మీ పరిసరాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా పోలీసులకు సమాచారం అందిస్తే వివరాలు గోప్యంగా ఉంచి తగిన ప్రోత్సాహకాలు అందిస్తామని కోస్టా సచివాలయం మహిళా పోలీసు బమ్మిడి అమ్మోజీ తెలిపారు. పోలీసుల ఆదేశాల మేరకు కోస్టా పంచాయతీలో ప్రైవేటు పాఠశాలల విద్యార్థులతో కలిసి సంకల్పం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంట్లో ఒక్కరూ వ్యసనానికి బానిసైనా ఇంటిల్లిపాదికి నష్టం తప్పదన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ కరమజ్జి రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు వైష్ణవి



వైష్ణవిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ స్థాయి అండర్ –19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ టోర్నమెంట్ ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు హర్యానా రాష్ట్రంలోని భీవానిలో జరగనున్నాయి. ఈ పోటీలకు హాజరయ్యే రాష్ట్ర జట్టులో కేశవరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని గురుగుబెల్లి వైష్ణవి చోటు దక్కించుకుంది. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో మెరుగైన ప్రదర్శన ద్వారా ఎంపికైంది. ఈ సందర్భంగా వైష్ణవిని హెచ్‌ఎం బి.వి.సాయిరాం, పీడీ మొజ్జాడ వెంకటరమణ, పీఈటీ జి.మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

ఎచ్చెర్ల క్యాంపస్: గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఎచ్చెర్ల ప్రాథమిక ఆరోగ్యం వైద్యాధికారి గంగా ప్రియదర్శిని అన్నారు. ఎచ్చెర్ల పీహెచ్‌సీలో మంగళవారం ఆశ దినోత్సవం నిర్వహించారు. ఆశా కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. గర్భిణులు సర్వేనిర్వహించాలని, నెలవారీ పరీక్షలపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి గర్భిణికి ఆస్పత్రుల్లోనే ప్రసవం జరగాలన్నారు. పీహెచ్‌సీల్లో ప్రసవాలు పెంచాలని చెప్పారు. పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందన్నారు. గ్రామాల్లో పిల్లల వ్యాక్సినేషన్ సక్రమంగా జరగాలని చెప్పారు. జ్వరాలు, ఇతర ఆరోగ్య సమస్యలు ఉంటే ఆశాకార్యకర్తలు వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

సహకార సంఘం.. సేవలు విస్తృతం

- కేంద్రం చొరవతో పీఏసీఎస్‌లలో రికార్డుల కంప్యూటరీకరణ
- గ్రామస్థాయిలో విస్తృత సేవల దిశగా అడుగులు
- పారదర్శకతకు పెద్దపీట వేసేలా చర్యలు



అంపోలు పీఏసీఎస్ కార్యాలయం



కంప్యూటరీకరణ చేస్తున్న ఉద్యోగులు (ఫైల్)

గార : రైతులకు ఆర్థికంగా తోడ్పాటునందించడంలో ప్రాథమిక సహకార సంఘాల పాత్ర కీలకం. వాటిని మరింత బలోపేతం చేసి సేవలు సులభతరం చేయాలనే లక్ష్యంతో కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ అడుగులు వేస్తోంది. ఇప్పటివరకు అమలవుతున్న సేవలను కంప్యూటరీకరణ చేస్తూ పారదర్శకతకు పెద్దపీట వేసేలా కార్యాచరణ ప్రారంభించింది. తద్వారా సహకార సంఘాల్లో బినామీలు, తప్పుడు పత్రాలతో రుణాలు తీసుకోవడం వంటి పొరపాట్లకు ఇక చెక్ పడనుంది. నేషనలైజ్డ్ బ్యాంకుల తరహాలో రుణాల వివరాలన్నీ కంప్యూటరీకరణ జరుగుతోంది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి పీఏసీఎస్‌ల నుంచి బ్యాంకులుగా మార్చేందుకు సిద్ధమవుతోంది.

మూడంచెల విధానంలో..

తొలుత ప్రాథమిక సహకార సంఘంలో డేటా అప్‌లోడ్ జరుగుతుంది. పీఏసీఎస్ సీఈవో లాగిన్ అయ్యాక వివరాలను సూపర్‌వైజర్, సొసైటీ ఆడిటర్ లాగిన్‌లో క్రాస్‌చెక్ చేస్తారు. ఆమోదం లభించాక ప్రీ మైగ్రేషన్ పేరిట 2024 ఏప్రిల్ 1 నుంచి జరుగుతున్న లావాదేవీల వివరాలన్నీ అప్‌లోడ్ చేస్తారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత గో–లైవ్ విధానంలో సేవలందిస్తారు. ఈ సేవలను వచ్చే ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అందించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఉపయోగాలెన్నో...

- పీఏసీఎస్‌లను నాబార్డ్ సాఫ్ట్‌వేర్ ద్వారా డీసీసీబీలకు జాతీయ నెట్‌వర్క్‌తో అనుసంధానం చేసేలా కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ చర్యలు చేపట్టింది.
- సొసైటీలో నమోదైన ప్రతి ఖాతాదారుడికి కంప్యూటరైజ్డ్ పాస్‌బుక్ వస్తుంది. డేటాలో తప్పులు జరిగే అవకాశం ఉండదు. తక్షణమే రిపోర్టులు అందుబాటులో ఉంటాయి.
- తీసుకున్న రుణం, చెల్లిస్తున్న సొమ్ము, వడ్డీ వివరాలను ఖాతాదారుడు సులువుగా తెలుసుకోవచ్చు.
- ప్రతి ఖాతాను ఆధార్‌తో అనుసంధానం చేస్తారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలన్నీ నేరుగా రైతు ఖాతాలకే జమకానున్నాయి.
- గ్రామస్థాయిలో బ్యాంకింగ్ సేవలతో పాటు ఎరువుల పంపిణీ, పరికరాలు, రుణాలు అందించడం సులభతరమవుతుంది.
- గార మండలంలో రెండు సంఘాలున్నాయి. వీటిలో అంపోలు సొసైటీ పరిధిలో 3324 మంది, తూలుగు సొసైటీ పరిధిలో 2798 మంది రైతులు లావాదేవీలు చేస్తున్నారు.


సేవల్లో పారదర్శకత..



రైతులకు అందించే సేవల్లో పారదర్శకత పెరుగుతుంది. ఎటువంటి సేవలైనా గ్రామస్థాయిలో పొందవచ్చు. సొసైటీలో పొరపాట్లు జరిగితే వాటిని సులువుగా అధిగమించవచ్చు. కేంద్ర సహకార శాఖ ఈ ప్రాజెక్టుకు బడ్జెట్ కేటాయించడం వల్ల సంఘాలు బ్యాంకులుగా మారుతున్నాయి. సిబ్బంది సహకారంతో శతశాతం నమోదు పూర్తి చేసాం.

– కె.అచ్చెన్నాయుడు, సీఈవో, పీఏసీఎస్, అంపోలు

పునాదులకే పరిమితం



ఎచ్చెర్లలో ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో చేపట్టిన రైతు భరోసా కేంద్రం నిర్మాణం పునాదల దశకే పరిమితమైంది. ప్రస్తుతం మండల పరిషత్ కార్యాలయం సమీపంలో ఉన్న పాత భవనంలో రైతు సేవా కేంద్రం నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పనులను పునఃప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

వృత్తి నైపుణ్యాలపై అవగాహన



వృత్తి విద్యా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని పొన్నాడ కేజీబీవీ ప్రత్యేకాధికారి సూర్యకళ అన్నారు. కేజీబీవీ ఇంటర్మీడియట్ విద్యార్థినులు మంగళవారం పారిశ్రామిక, నైపుణ్య కేంద్రాల సందర్శనలో భాగంగా శ్రీకాకుళం నగరంలోని బ్యూటీ పార్లర్లను పరిశీలించారు. బ్యూటీషియన్ కోర్సు, ఆదాయ వనరులను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జీసీడీవో నీరజ పాల్గొన్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

'కంచె' పట్టు చీరలు..



పంట ప్రారంభ దశలో మొక్కలను అడవి పందులు, కుందేళ్లు తినేయకుండా రక్షణగా రైతులు పాత చీరలు వినియోగిస్తున్నారు. మెట్టపేటలో టమాటా సాగుకు ఇలా కంచెగా చీరలు చుట్టారు. పెట్టుబడి తక్కువగా ఉండటంతో పరిసర ప్రాంతాల్లో చాలామంది రైతులు ఇదే పద్ధతి అవలంబిస్తున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

కిశోరీ బాలికల వికాసానికి కృషి



శ్రీకాకుళం అర్బన్: అంగన్‌వాడీలకు యంత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్



జి.సిగడాం: మాట్లాడుతున్న సీడీపీఓ పాపినాయుడు



ఎచ్చెర్ల: లావేరు వెలుగు కార్యాలయంలో మాట్లాడుతున్న ఎస్సై లక్ష్మణరావు

శ్రీకాకుళం అర్బన్: కిశోరి వికాసం కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని గుజరాతిపేటలోని ఐసీడీఎస్ అర్బన్ కార్యాలయంలో కిశోరి వికాసం–2 కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. పోస్టర్లను ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం చిన్నారుల బరువు తూచే యంత్రాలను అంగన్‌వాడీలకు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ శోభారాణి, టీడీపీ నాయకులు మాదారపు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జి.సిగడాం: బాల్యవివాహాల నిర్మూలనకు అందరూ సహకరించాలని ఎచ్చెర్ల ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ డోల పాపినాయుడు కోరారు. జి.సిగడాం మండల పరిషత్ కార్యాలయంలో కిశోరీ వికాసంపై శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, ఎంపీడీఓ గుంటముక్కల రామకృష్ణారావు, వైద్యాధికారి పేకల సుమబిందు, డీఆర్‌పీలు బోనేల గౌరీశ్వరరావు, ఏర్నేన జ్యోతి శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ తమ్మినేని లక్ష్మి, కుమారి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: బాలబాలికల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని లావేరు ఎస్సై జి.లక్ష్మణరావు అన్నారు. లావేరు వెలుగు కార్యాలయంలో కిశోరీ వికాసంపై మండల స్థాయి శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ వాగ్దేవి, సీడీపీవో ఝాన్సీ భాయి, ఈవోపీఆర్‌డీ విశ్వేశ్వరరావు, వైద్యాధికారి మోనీభూషణ్, ఎంఈవో మురళీకృష్ణ, ఐసీడీఎస్ ఈవో ఉష, ఏ.గీత, రిసోర్స్‌పర్సన్లు లక్ష్మణరావు, గోవిందరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా మరోసారి గెలిపించాలి



లావేరులో రఘువర్మను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఎచ్చెర్ల: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏపీటీఎఫ్ అభ్యర్థిగా పోటీలో ఉన్న తనను మరోసారి ఎమ్మెల్సీగా గెలిపించాలని శాసనమండలి సభ్యుడు పాకలపాటి రఘువర్మ కోరారు. ఈ మేరకు లావేరు మండలంలోని లావేరు, బెజ్జిపురం, వెంకటాపురం, మురపాక, తామాడ, అదపాక, కేశవరాయునిపాలేం ఉన్నత పాఠశాలలు, మురపాక కేజీబీవీ, తామాడ మోడల్ స్కూళ్లను సందర్శించి మొదటి ప్రాధాన్యతా ఓటు తనకే వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో లావేరు ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు నాగభూషణం, వండాన జగదీష్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు మీసాల శ్రీనివాసరావు, పైడి శ్రీరామూర్తి, వి నాగరాజు, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రోత్సాహం అవసరం



ఎచ్చెర్ల క్యాంపస్: దివ్యాంగులకు బహుమతులు అందజేస్తున్న వీసీ రజని



జి.సిగడాం: దివ్యాంగులకు బహుమతులు అందిస్తున్న ఎంఈఓ రవి



ఎచ్చెర్ల: లావేరులో దివ్యాంగులకు బహుమతులు అందిస్తున్న ఎంఈవో మురళీకృష్ణ

ఎచ్చెర్ల క్యాంపస్: దివ్యాంగులకు వారికి నచ్చిన, ఎంచుకున్న రంగాల్లో ప్రోత్సహించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వీసీ కె.ఆర్.రజని అన్నారు. వర్సిటీలో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సమగ్ర విద్యా సమన్వయకర్త బి.గోవిందరావు మాట్లాడుతూ పాఠశాలల్లో సెప్టెంబర్ నాటికి 5,900 మంది విద్యాంగులను గుర్తించి వివిధ రంగాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో రెక్టార్ అడ్డయ్య, రిజిస్ట్రార్ సుజాత పాల్గొన్నారు.

జి.సిగడాం : విజయం సాధించాలనే లక్ష్యముంటే వైకల్యం అడ్డురాదని ఎంఈఓ అరసాడ రవి అన్నారు. మంగళవారం జి.జిగడాం ఎంఆర్‌సీ కార్యాలయంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఆటలపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సీర రాము, ఐఈఆర్‌పీలు తాడి కృష్ణ, సీహెచ్ మాధురి, ఐఈడీఎస్ అర్జున్ పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: దివ్యాంగులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో మురళీకృష్ణ కోరారు. లావేరు భవిత కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. దివ్యాంగ పోటీల విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హేమలత, ఉపాధ్యాయులు శోభారాణి, మూర్తి, ఎంఐఎస్ చంద్రశేఖర్, సీవో నాగరాజు, ఐఈఆర్‌పీలు మాధురి, బొట్లరాజు మిస్క, సీజీబీ లక్ష్మీ, సత్యవతి, సూర్యనారాయణ, పద్మావతి, లక్ష్మణరావు పాల్గొన్నారు.

గార: దివ్యాంగులో ప్రతిభ వెలికి తీసే బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందని డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎ.గౌరిశంకర్ అన్నారు. కుమ్మరిపేట భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ సంబరాలను ఎంఈవో ఎన్.రామకృష్ణ ప్రారంభించారు. అమెరికాకు చెందిన ఫణికిషోర్, నాగప్రవల్లిక దంపతులు సమకూర్చిన ఉపకరణాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీ ఎ.రఘులక్ష్మి, ఎస్.సత్యన్నారాయణ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాజీయే రాజమార్గం



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ సన్యాసినాయుడు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): యాక్సిడెంట్ కేసులకు సంబంధించి ముందస్తు లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు కోరారు. దీనిలో భాగంగా జిల్లా కేంద్రంలో మంగళవారం రోడ్డు ప్రమాదాలకు సంబంధించి ఆర్టీసీ వారు 12 కేసులు పిలవగా మూడింటిని రాజీ చేశారు.

ఘనంగా కామాక్షి ఏకాంబరేశ్వర కల్యాణం



పూజలందుకుంటున్న స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాండ్రంగి వీధిలో పోలిపాడ్యమి సందర్భంగా కామాక్షిదేవి ఏకాంబరేశ్వర కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. పీఠం నిర్వాహకులు వేదుల వెంకటరమణశర్మ, సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

రాజేంద్రప్రసాద్ సేవలు చిరస్మరణీయం



బాబూ రాజేంద్రప్రసాద్ వద్ద చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: లావేరు శాఖా గ్రంథాలయంలో మంగళవారం తొలి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి గ్రంథాలయ అధికారి మురపాక శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ డైరీని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తన చాంబర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు గంజి ఆర్.ఎజ్రా, ఉపాధ్యక్షులు పిన్నింటి అప్పన్న, ప్రధాన కార్యదర్శి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న తహశీల్దార్ రమణారావు

గార: త్వరలో జరగనున్న నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నామని తహశీల్దార్ ఎస్.రమణారావు చెప్పారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గార మండలంలో నారాయణపురం ఛానల్ పరిధిలో శ్రీకూర్మం, వాడాడ, వంశధార కుడిప్రదాన కాలువ పరిధిలో అంపోలు–1, అంపోలు–2, శ్రీకూర్మంలు, బైరి ఓపెన్‌హెడ్ ఛానెల్‌కు సంబంధించి వమరవెల్లి, అంపోలు, కొర్లాం సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయని వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త, డీఈఈ కె.వి.క్రాంతికుమార్, ఏఈఈలు సత్యనారాయణ, మోహనరావు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదానం చేస్తున్న యువకులు

శ్రీకాకుళం కల్చరల్: నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ వలంటీర్స్ దినోత్సవం సందర్భంగా హరి మహదేవ్ హెల్ప్ ఫౌండేషన్ సహకారంతో ఎన్‌వైకే కార్యాలయంలో రెడ్‌క్రాస్ సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 40 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో యువ కేంద్రం జిల్లా యువజన అధికారి కె.వెంకట్ ఉజ్వల్, సెట్‌శ్రీ సీఈవో బి.వి.ప్రసాదావు, జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు, డిజెబులిటీ ఏడీ కె.కవిత, ఎన్‌వైకే అకౌంటెంట్ డి.శ్రీనివాసరావు, డీపీఎం ఆదిలింగం, పి.శ్రీకాంత్, రెడ్‌క్రాస్ సభ్యులు పెంకి చైతన్యకుమార్, ఎన్ఎస్ఎస్ పీఓ ఎం.నాగభూషణరావు, హరిమహదేవ్ ఫౌండేషన్ అధ్యక్షులు తంగి హరికృష్ణ, ఏ.శ్రీనివాస్ కుమార్, వివేకానంద యువజన సేవా సంఘం, ఝాన్సీ అగ్రికల్చరల్ అండ్ ఇంటిగ్రేటెడ్ వెల్ఫే సొసైటీ అధ్యక్షులు గుజ్జల ఉమామహేశ్వరరావు, రౌతు సుమతి మోహనరావు, ఎన్‌వైకే వలంటీర్లు, యువకులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో బహుళ ప్రయోజనాలు



శిక్షణ ఇస్తున్న ధనుంజయరావు

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రస్తుత వ్యవసాయ పద్ధతుల్లో మార్పులు అవసరమని, సేంద్రియ సాగుతో బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని రైతు సాధికార సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ ధనుంజయరావు అన్నారు. ఎచ్చెర్ల సాంకేతిక శిక్షణ కేంద్రంలో వ్యవసాయ శాఖ, రైతు సాధికార సంస్థలు ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగుల మందులు వినియోగం తగ్గాలని చెప్పారు. రైతులు ఘన, ద్రవ జీవామృతం, కషాయాల వినియోగం, తయారీపై ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు రిసోర్సుపర్సన్లు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య స్వామికి విశేష పూజలు



ఎచ్చెర్లలో పూజలందుకుంటున్న సుబ్రహ్మణ్య స్వామి



సుబ్రహ్మణ్యస్వామికి పెరుగుతో అభిషేకం

శ్రీకాకుళం కల్చరల్/ఎచ్చెర్ల క్యాంపస్: నగరంలోని గుడివీధిలో ఉమారుద్ర కోటేశ్వరస్వామి దేవాలయం వద్ద గంగామాత ఆలయంలో సుబ్రహ్మణ్య షష్టి ఉత్సవాలలో భాగంగా మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నక్క వీధిలోని ఉమాజఠలేశ్వరస్వామి దేవాలయంలో మార్గశిరమాస మొదటి మంగళవారం సందర్భంగా సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. ఎచ్చెర్ల గ్రామంలోని గిరిజా ముక్కంటేశ్వర దేవస్థానంలో సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.